క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్టాపన పూజలు



గంగను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ గ్రామంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీమాత విగ్రహ ప్రతిష్ట పూజలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మహాగణపతి, సుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహ విగ్రహాల ప్రతిష్టాపనలు చేశారు. సాయంత్రం గంగపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం చేసి హోమాలు నిర్వహించారు. ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో విచ్చేసి ఆలయంలో పూజలు జరిపించారు. శుక్రవారం వేకువజామున అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రాణప్రతిష్ట చేయనున్నట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు మల్లికార్జున, ఆర్వేటి లేపాక్షిశెట్టి తెలిపారు.

పశు గ్రాసానికి నిప్పు



గ్రాసానికి నిప్పు పెట్టిన దృశ్యం

బ్రహ్మసముద్రం: మండలంలోని రాయలప్పదొడ్డి గ్రామానికి చెందిన రైతు రాయల్ నాగరాజు మూడు ఎకరాల్లో పశు గ్రాసం సాగు చేశాడు. దీంతో బుధవారం సాయంత్రం చీకటి పడిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పశువుల గ్రాసానికి నిప్పు పెట్టారు. దీంతో మూడు ఎకరాల్లో సాగు చేసిన గ్రాసం పూర్తిగా కాలి పోయింది. గమనించిన స్థానికులు రైతులు మంటలను అదుపు చేశారు. అప్పటికే పొలంలో ఉన్న డ్రిప్ పరికరాలు, నీరు సరఫరా చేసే పైపులు సైతం కాలిపోయినట్లు బాధితరైతు వాపోయాడు.

450 క్వింటాళ్ల కందుల కొనుగోలు

కూడేరు: మండల పరిధిలోని పి.నారాయణపురంలో ప్రభుత్వం తరఫున లక్ష్మీనరసింహా మ్యాక్స్ కో–ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా 450 క్వింటాళ్ల కందులను కొనుగోలు చేసినట్లు ఆ సొసైటీ ప్రతినిధి మనోహర్ రెడ్డి తెలిపారు. పి.నారాయణపురం కొనుగోలు కేంద్రానికి చోళసముద్రం, జయపురం, ఎంఎంహళ్లి, కరుట్లపల్లి గ్రామాల రైతులు కందులు తీసుకిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం కూడేరులో కందుల కొనుగోళ్లను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. అరవకూరు. కమ్మూరు, గొటుకూరు, కడదరకుంట, ఇతర గ్రామాల రైతులు కందులు తెస్తే క్వింటా రూ.7,550 ప్రకారం కొనుగోలు చేస్తామన్నారు. రవాణా, హమాలీల ఖర్చులు, కందులు జల్లడి పట్టడానికి అయ్యే ఖర్చులను రైతులే భరించాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్ఏ ప్రమోద్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: కార్మికుల హక్కులను కాలరాచే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, జిల్లా సహాయ కార్యదర్శి అచ్చుత్ ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఇన్‌చార్జ్ ఏఓ ప్రవీణ్ కుమార్‌కు లేబర్ కోన్స్ రద్దు చేయాలని వినతిపత్రం అందజేశారు. నాయకులు మట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి లేబర్ కోడ్స్‌గా తీసుకువచ్చింది. ఇవి అమలు జరిగితే వేతనాలు, సామాజిక భద్రత వృత్తి భద్రత, ఆరోగ్య భద్రత, వీటన్నింటినీ కార్మికులు కోల్పోతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, సివిల్ సప్లై హమాలీ యూనియన్ నాయకులు వన్నూరప్ప, తిమ్మప్ప, న్రట్రాజ్, వన్నూరస్వామి తదితరులు పాల్గొన్నారు.





ఆటో డ్రైవర్లకు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ విశ్వనాథరెడ్డి

భద్రత .. మనందరి బాధ్యత !

- నిబంధనలు పాటించకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు
- మృతుల కుటుంబాల్లో తీరని శోకం
- 15 వరకూ రోడ్డు భద్రతా మాసోత్సవాలు
- అవగాహన కల్పిస్తున్నామంటున్న రవాణాశాఖ అధికారులు

రాయదుర్గంటౌన్: రోడ్డు ప్రమాదంలో ఎవరూ గాయపడి చేతులు, కాళ్లు విరగ్గొట్టుకున్నా, లేక పోతే ప్రాణాలొదిలినా మరణించినా వ్యక్తికే కాదు. ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడాల్సిందే. ఒక్క రోడ్డు ప్రమాదం.. ఎన్నో కుటుంబాలను కకావికలం చేసిన సంఘటనలు ఎన్నో జరిగాయి. బైక్, కారు, ఇతర వాహనాలపై వెళ్లే వారు నిబంధనల ప్రకారం హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకపోతే, మైనర్లను వాహనాల డ్రైవింగ్‌కు దూరంగా ఉంచితే ప్రమాదాలు వందశాతం నివారించి ఎన్నో ప్రాణాలు కాపాడవచ్చని పోలీసులు, రోడ్డు రవాణాశాఖ, మోటార్ వెహికల్ అధికారులు చెబుతున్నారు.

ప్రమాదాల నివారణపై విస్తృత ప్రచారం

రోడ్డు ప్రమాదాలను తగ్గించాలి, ప్రాణ నష్టం జరగకుండా కాపాడాలనే ఆలోచనతో రోడు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జనవరి 16వ తేదీ నుంచి ప్రారంభమైన మాసోత్సవాలు ఈనెల 15వ తేదీ వరకూ జరుగుతాయి. పాఠశాలలు, కళాశాలలు, ఆటో స్టాండ్లు, ప్రధాన కూడళ్లు, ఆర్టీసీ, ఎంవీఐ కార్యాలయంలో వాహనదారులకు, ప్రజలకు, డ్రైవర్లకు అవగాహన సదస్సులు, ట్రాఫిక్ నియమ బంధనల గురించి తెలియజేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలకు జరిగే నష్టాలను పోస్టర్లు, ఇతరాత్ర అంశాలతో అవగాహన కల్పిస్తూ చైతన్యపరుస్తున్నారు. స్థానిక పోలీసులు వాహనాల తనిఖీలు చేపడుతూ హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్సు తనిఖీ చేస్తూ ప్రమాదాల నివారణకు చెక్ పెడుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



వాహనదారులు, డ్రైవర్లు నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు జరగవు. అధిక శాతం మానవ తప్పిదాలు, నిబంధనలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటన్నింటికీ ఒక్కటే మార్గం. నిబంధనలు పాటించాలి, డ్రైవింగ్ చేసే వారికి కూడా అప్రమత్తత, ఏకాగ్రత అవసరం. హెల్మెంట్, సీట్ బెల్ట్ వాడడం, వేగనియంత్రణ కచ్చితంగా పాటించాలి. వీటిపై వాహనదారులకు నిత్యం అవగాహన కల్పిస్తున్నాం. – విశ్వనాథరెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, రాయదుర్గం

ప్రమాదాల నివారణే కర్తవ్యం



అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యంగా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపి చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారు. క్షణాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. ఎన్నో కుటుంబాలు రోడ్డు పడుతున్నాయి. అందుకే నిబంధనల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. నిబంధనలు మీరిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నాము. – జయానాయక్, సీఐ, రాయదుర్గం అర్బన్

- రాయదుర్గం మండలం గ్రామదట్ల గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చి తిరుగు ప్రయాణంలో రాయదుర్గం–బళ్లారి రోడ్డులో హడగలి గ్రామం వద్ద కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురై బళ్లారికి చెందిన సాయిరాం దుర్మరణం పాలయ్యాడు. హెల్మెంట్ వాడివుంటే ఆ యువకుడి ప్రాణాలు దక్కేవి.
- రాయదుర్గం పట్టణంలోని అనంతపురం రహదారిపై గత మంగళవారం ద్విచక్ర వాహనపై వెళుతున్న భూపసముద్రానికి చెందిన మంజును ట్రాక్టర్ ఢీకొనడంతో మృతి చెందాడు. నిబంధనలు పాటించకుండా ఒకే వాహనంపై ముగ్గురు, హెల్మెట్ వాడకపోవడంతో పాటు ట్రాక్టర్ డ్రైవర్ అతివేగం ప్రాణ నష్టానికి కారణమైంది.
- శెట్టూరు మండలం లక్ష్మంపల్లికి చెందిన ఫరూక్, తన స్నేహితుడు తాసిర్‌తో కలిసి గత నెల 17న రాత్రి ఇజితిమాకు బయల్దేరగా కళ్యాణదుర్గం సమీపంలో గూబనపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ మృత్యువాత పడ్డాడు. అతివేగం , హెల్మెట్లు వాడకపోవడంతోనే ప్రాణాలు గాల్లో కలసిపోయాయి.
- గుమ్మఘట్ట మండలం గోనబావి గ్రామం వద్ద ఏపీఆర్ స్కూల్ చెందిన బస్సు బోల్తా పడింది. అయితే స్వల్పగాయాలతోనే నలుగురు బయటపడ్డారు. డ్రైవర్ అప్రమత్తంగా లేకపోవడం, అతి వేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు.

డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఆర్టీటీ ఆస్పత్రిలో బుధవారం ఆర్టీఓ రమేష్ అధ్యక్షతన 40 మంది ఆటో, బస్సు డ్రైవర్లకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఆర్టీఓ మాట్లాడుతూ డ్రైవర్లు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్వేత బిందు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలను వాడకంలోకి తేవాలి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బ్రహ్మసముద్రం: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వాడుకంలోకి తీసుకురావాలని డీఎల్‌ఈఓ నాగేశ్వర్‌రావు ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని చెత్త నుంచి సంపద తయారు కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారు కేంద్రాలను వాడుకలోకి తీసుకురావాలన్నారు కార్యక్రమంలో ఎంపీడీఓ నందకిశోర్, ఉపాధి ఏపీఓ పండరీష్, పంచాయతీ కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

'గుడ్లు, మాంసంపై అపోహలు వద్దు'

ఉరవకొండ: కోడి గుడ్లు, మాంసంపై ఎటువంటి అపోహలు అవసరం లేదని ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాయలంలో విలేకరులతో మాట్లాడారు. కోళ్ల మరణాలను దృష్టిలో ఉంచుకుని లేనిపోని అపోహలు ప్రచారం చేస్తున్నారన్నారు. కోడిగుడ్లు, మాంసం వినియోగించడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినట్లు ఏ సంస్థలు, శాఖలు ధృవీకరించలేదని తెలిపారు. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే కోళ్ల మరణాలు ఉన్నాయని గుర్తు చేశారు. జిల్లాలో అలాంటి మరణాలు ఎక్కడా చోటు చేసుకోలేదన్నారు. ప్రజల్లో అపోహలు, ఆందోళనలను నివృత్తి చేయడానికి పశుసంవర్ధక శాఖ అధ్వర్యంలో ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బెళుగుప్ప: స్థానిక పీహెచ్‌సీ వద్ద గుండ్లపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై ఈనెల 2వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నాగరాజు (40) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆమిద్యాల గ్రామానికి చెందిన నాగరాజు తల్లి నాగమ్మతో కలసి బెళుగుప్ప మీదుగా పులికల్లు గ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. బెళుగుప్ప పీహెచ్‌సీ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో తల్లీకొడుకుకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ నాగరాజు మృతి చెందాడు. తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఏఎస్ఐ రామదాసు పేర్కొన్నారు.

విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్య సిబ్బంది

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని పశు వైద్యశాల ఆవరణలో బుధవారం జ్ఞాన భారతి స్కూల్ విద్యార్థులకు పశుసంవర్ధక శాఖపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ శ్రీనివాస్‌గుప్త వ్యాధి బారిన పడిన పశువులను పరీక్షించే విధానం కోళ్లలో గల వివిధ జాతుల పోషణ, పునరుత్పత్తి అంశాలపై విద్యార్థులకు వివరించారు. అనంతరం పశువులకు వచ్చే వివిధ రకాల వ్యాధులు, నివారణ వ్యాక్సినేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించారు కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త పశువైద్యులు హరిణి, పశువైద్యుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పర్వతేశ్వర స్వామి రథోత్సవం





రథాన్ని లాగుతున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) అలంకరణలో పర్వతేశ్వర స్వామి

ఉరవకొండ: రాయంపల్లి గ్రామంలో బుధవారం పర్వతేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. రాయంపల్లి, నెరిమెట్ల, వ్యాసాపురం గ్రామస్తులు, పెద్దల ఆధ్వర్యంలో తొలుత పర్వతేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథంపై స్వామిని కొలువుదీర్చారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు రథాన్ని లాగారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రథోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఆర్కెస్ట్రా అలరించింది.

మద్యం షాపులకు దరఖాస్తు గడువు పొడిగింపు



గీత కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య

రాయదుర్గం: జిల్లాకు మరో 14 మద్యం దుకాణాలు మంజూరయ్యాయని, వాటన్నింటినీ ఈడిగ, గౌడ, గౌడ్ ఉప కులాలకు కేటాయించేలా ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిందని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. బుధవారం రాయదుర్గం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, సీఐ మహేష్‌కుమార్‌తో కలసి గీత ఉప కులాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గీత ఉప కులాలన్నీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెంటల్ ఫీజు కూడా సగమే ఉంటుందన్నారు. బుధవారంతోనే గడువు పూర్తయినా మరో మూడు రోజులు (8వ తేదీ వరకు) దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగించారని వివరించారు. ఏ చిన్న అనుమానం ఉన్నా స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. రెంటల్ ఫీజు రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని, ఇందులో ఎలాంటి మినహాయింపు లేదన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ పవన్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ అంజినప్పగారి హరియన్న, ఈడిగ కులస్తులు రంగనాథ, అశోక్, ఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై లోక్ అదాలత్



రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏడీ గురురాజ్

బ్రహ్మసముద్రం: విద్యుత్ వినియోగారులు, రైతుల కోసం మండల కేంద్రంలో విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ గురురాజ్ ఫిర్యాదులు స్వీకరించారు. గతంలో పనిచేసిన ఏఈ బాలచంద్ర ట్రాన్స్‌ఫార్మర్లను అందించకుండా నిర్లక్ష్యం వహించారంటూ పలుగ్రామాల రైతులు ఫిర్యాదు చేశారు. అలాగే కొందరు రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేసి కరెంట్ స్తంభాలు, వైర్లు, ఇతర సామగ్రి అందించ లేదని అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఏడీ మాట్లాడుతూ త్వరలో రైతుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్ల క్రితం డీడీ కట్టి సంబంధిత పత్రాలను సమర్పించినప్పటికీ అప్పటి ఏఈ బాలచంద్ర ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు, మెటీరియల్‌ను వేరే వాళ్లకు అందించారని పిల్లలపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు అధికారుల ఎదుట వాపోయాడు. కార్యక్రమంలో ఏఈ భరత్, లైన్ ఇన్‌స్పెక్టర్ శీనా నాయక్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ పేపర్స్ పంపిణీ



మోడల్ పేపర్స్ అందజేస్తున్న ఎంఈఓ శ్రీధర్, బ్యాంక్ సిబ్బంది

శెట్టూరు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బ్యాంక్ ఉద్యోగి లోకేష్ ఆధ్వర్యంలో మోడల్ పేపర్స్ వితరణ చేశారు. కార్యక్రమానికి ఎంఈఓ శ్రీధర్, యూటీఎఫ్ నాయకులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సుమారు 70 మందికి మోడల్ పేపర్స్ పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, బట్టీ పట్టీ చదవకుండా అవగాహనతో నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఫిరోజ్ ఖాన్, యూటీఎఫ్ నాయకులు మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఊరేగింపు

గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంట, రంగసముద్రం గ్రామాల్లో ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని ముత్యాల పల్లకీలో ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఆలయంలో కుంకుమార్చన, పంచామృతాభిషేకం, మహా మంగళారతి తదితర పూజలను నిర్వహించారు. ఊరేగింపులో యువకులు నందికోళ్లతో నృత్యం చేశారు. ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టారు.

గోనె సంచుల షాపులో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఉరవకొండ: అనంతపురం–బళ్లారి 42వ జాతీయ రహదారిపై దేవాంగ కళ్యాణ మండపం సమీపంలో గోనె సంచుల షాపు బుధవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం అయింది. షాపు యాజమాని కపట్రాళ్ల జాఫర్ తెలిపిన వివరాలు.. షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో షాపులో ఉన్న రూ.4 లక్షలు విలువ చేసే సంచులు, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటినా సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కూడేరు: మండల పరిధిలోని అంతరగంగకు చెందిన శివనాథ్, అతని భార్య వాణి, కుమార్తె మహాలక్ష్మి బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వీరు ద్విచక్ర వాహనంలో అంతరగంగ నుంచి కూడేరుకు వెళుతుండగా.. మార్గమధ్యంలో రోడ్డుకు అడ్డంగా కుక్క రావడంతో అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో గాయపడిన క్షతగాత్రులను 108 వాహనంలో అనంతపురంలోని సర్వజన ఆస్పత్రికి తరలించారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలి

వజ్రకరూరు: వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలోకి చేర్చాలి. వెంటనే ఆదిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు, భోభోఅసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.భీమిరెడ్డి డిమాండ్ చేశారు. నియోజకవర్గ బోయ సంఘం నాయకులు బుధవారం కొనకొండ్ల గ్రామంలో వై.భీమిరెడ్డిని కలిసి పలు సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా భీమిరెడ్డి మాట్లాడుతూ.. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించగా.. ఇతర ప్రాంతాల్లో మాత్రం బీసీలుగా ఉన్నారని వెల్లడించారు. వైఎస్ జగన్ హయాంలో శామ్యూల్ ఆనంద్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ నియమించడం జరిగిందన్నారు. ఈ కమిటీ రాయలసీమలో పర్యటించి నివేదికను ప్రభుత్వానికి సమర్పించడం జరిగిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. కేంద్రంలో భాగస్వామ్యులుగా ఉన్న టీడీపీ కేంద్రంతో సంప్రదించి వాల్మీకులు, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేలా చూడాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల కమిటీ ఎన్నిక

కళ్యాణదుర్గ రూరల్: పట్టణంలోని 9వ వార్డు సచివాలయంలో బుధవారం కళ్యాణదుర్గం పట్టణ సచివాలయ ఉద్యోగుల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నల్లప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీకాంత్, ట్రెజరర్‌గా పవన్‌కుమార్, ఆర్గనైజర్ సెక్రటరీగా రాయల్ ములకేష్, ఉపాధ్యక్షులుగా ఉపేంద్ర, అనిత, మనోజ్ గంగాధర్, శైలజ, రాము ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఏపీజీఏ అధ్యక్షుడు గోపికృష్ణ, ప్రధాన కార్యదర్శి రామునాయక్, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమమంతు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇలా వచ్చి.. అలా వెళ్తూ

- ఉరవకొండ సీహెచ్‌సీలో ఓపీని వదిలి వెళ్లిపోతున్న వైద్యులు
- ప్రైవేట్ క్లినిక్‌లు నిర్వహిస్తూ జేబులు నింపుకుంటున్న వైనం
- సకాలంలో రోగులకు అందని వైద్యం



ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ



వైద్యుడి కోసం వేచి ఉన్న రోగులు

ఉరవకొండ: ఉరవకొండ ప్రభుత్వ 50 పడకల సీహెచ్‌సీ ఆసుపత్రిలో కొంతమంది వైద్యాధికారులు వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. డబ్బు సంపాదనే ధ్యేయంగా మానవత్వాన్ని మంట కలుపుతూ వైద్య వృత్తికి చెడ్డపేరు తీసుకొస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నిబద్ధతతో వైద్యం అందించాల్సింది పోయి.. ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తూ జేబులు నింపుకుంటున్నారు. విషయం ఉన్నతాధికారులకు తెలిసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉరవకొండ సామాజిక ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ సివిల్ సర్జన్ ఆసుపత్రి ఇన్‌చార్జ్, చెవి, ముక్కు, గొంతు వైద్యనిపుణులు, ఎముకలు, కండరాల వైద్య నిపుణులు, కంటివైద్య నిపుణులు, దంత వైద్యులు, ఫిజియోథెరపిస్ట్, స్త్రీ వైద్య నిపుణురాలు, జనరల్ సర్జరీతో పాటు ముగ్గురు ఎంబీబీఎస్‌లు, అనస్తీషియా (మత్తు) డాక్టర్లు పని చేస్తున్నారు. వీరిలో 60 శాతానికి పైగా ఉరవకొండలో ప్రైవేట్ క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డ్యూటీ చేస్తున్నప్పుడు వారికి చెందిన క్లినిక్‌ల నుంచి కేసులు వస్తే నిమిషాల్లో ఓపీని వదిలి వెళ్లిపోతున్నారు. ప్రైవేట్ క్లినిక్‌లో వైద్యం చేసి తాపీగా విధుల్లోకి వస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వారు పనివేళ్లలో ప్రైవేట్ క్లినిక్‌లు నిర్వహించరాదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అయితే ఉరవకొండలోని కొందరు వైద్యులకు అది వర్తించడం లేదు. ఇక రాత్రి సమయాల్లో ఎమర్జన్సీ తప్ప, సాధారణ కేసులు ఏవీ వచ్చినా డ్యూటీ నర్సులే వైద్యం చేస్తుంటారు.

చర్యలు తీసుకుంటాం

ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో విధుల్లో ఉన్న వైద్యులు ప్రవేట్ క్లినిక్‌లు నిర్వహిస్తూ విధులు నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. ఆసుపత్రిలో డ్యూటీ టైంలో ఉంటూ ప్రవేట్ క్లినిక్‌లకు వెళ్లి వైద్యం చేయడం నేరం. అలాంటి వారిని గుర్తించి వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తాం.
– డాక్టర్ పాల్ రవికుమార్, డీసీహెచ్ఎస్, అనంతపురం